
సాక్షి
ప్రకాశం
సోమవారం | 12 | జూన్ | 2023



మృత్యు ఘోష
జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఆదివారం ఆరుగురు మృతిచెందారు. కనిగిరి ప్రాంతం లోనే ముగ్గురు మృత్యువాత పడ్డారు.
- 8లో..



ఎస్సై కొట్టాడని ఆత్మహత్యాయత్నం
ఎస్సై కొట్టాడని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అతని బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
41 /30

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా అధికం.

బడి గంట మోగే వేళ..



నేటితో వేసవి సెలవులు ముగిసి బడి గంట మోగనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు అడుగుపెట్టిన క్షణంలోనే ఎనిమిది రకాల వస్తువులతో విద్యాకానుక కిట్‌ను అందించనున్నారు. ఇప్పటికే టీచర్ల బదిలీల కౌన్సిలింగ్ పూర్తయింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడుతో సకల సౌకర్యాలు కల్పించడంతో అన్ని హంగులతో తరగతి గదులు చిన్నారులను స్వాగతిస్తున్నాయి.

- వేసవి సెలవుల తరువాత నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- జగనన్న విద్యాకానుకతో విద్యార్థులకు స్వాగతం
- అన్ని మౌలిక వసతులతో సిద్ధమైన తరగతి గదులు
- మండే ఎండల దృష్ట్యా వారం రోజులపాటు ఒంటిపూట తరగతులు
- తొలిరోజు నుంచే విద్యార్థులకు రాగిజావ, మధ్యాహ్న భోజనం
- 445 ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్‌టీవీలు
- మరో 277 ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీలతో విద్యాబోధన

జిల్లాలోని మొత్తం పాఠశాలలు: **3013**
వాటిలో ప్రభుత్వ పాఠశాలలు: **2454**
ప్రైవేటు పాఠశాలలు: **559**

మొత్తం విద్యార్థుల సంఖ్య	ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు
3,38,223	1,19,882

వీరిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు: **2,18,341**

అనుమతి లేని పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు



విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అవన్నీ సాకారం కావాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించాలి. జగనన్న విద్యాకానుక కిట్లను పిల్లలకు అందించేందుకు ఇప్పటికే చర్యలు పూర్తిచేశాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బడికి పంపడంపై ప్రత్యేక శ్రద్ధతోపాటు ఆగస్టు 31వ తేదీ వరకు నూతన అడ్మిషన్లను చేపడతాం. ఇటీవల ఒంగోలు సంతపేటలో ఒక పాఠశాల అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో దానిని మూసేయాలని ఆదేశించడంతోపాటు ఆ పాఠశాలకు ఎటువంటి గుర్తింపు లేదని ఇప్పటికే ఫ్లెక్సీ కూడా అక్కడ ఏర్పాటు చేయించాం. నిబంధనలు ఉల్లంఘించిన సంబంధిత పాఠశాల యాజమాన్యానికి నోటీసులు కూడా జారీ చేస్తున్నాం. హైస్కూల్ ప్లస్‌లో కూడా విద్యార్థుల శాతం పెంచేందుకు తగు చర్యలు చేపడుతున్నాం.

– డీఈవో పి.రమేష్

ఒంగోలు: వేసవి సెలవులు ముగిసిన అనంతరం సోమవారం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 3,38,223 మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ఇందులో 2,18,341 మంది ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులున్నారు. వీరందరికీ పాఠశాలల పునః ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసేందుకు ఇప్పటికే జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మరో వైపు దాదాపు 40 రోజులపాటు పాఠశాలలకు సెలవులు కావడంతో పాఠశాలల్లోని వసతులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు పూర్తిచేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్లు, ఆట స్థలం, ఇలా ఒకటేమిటి అన్నిరకాలుగా శుభ్రంగా ఉంచేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చర్యలు ప్రారంభించారు.

ప్రారంభం రోజే పుస్తకాలు:
గతంలో పాఠశాలలు ప్రారంభమవుతున్నాయంటేనే పేద విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. పాఠ్యపుస్తకాలు ఎప్పుడో ఒకప్పుడు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినా బ్యాగు, నోటు పుస్తకాలు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి వచ్చేది. రెండు జతల యూనిఫాం క్లాత్ ఇచ్చినా అదీ చాలీచాలని పరిస్థితి ఉండేది. దీంతో పుస్తకాలు, యూనిఫాం అందేసరికి సగం సంవత్సరం ముగిసేది. ఈ నేపథ్యంలో చినిగిన దుస్తులు, మాసిన యూనిఫాంతోనే బడికి వచ్చేవారు. పాఠశాలలకు కనీసం వైట్‌వాష్ (సున్నం) కొట్టించేందుకు సైతం నిధులకు కటకట ఉండేది. పాఠశాలలకు భద్రత కూడా అంతంత మాత్రమే. అరకొరగా టాయిలెట్లు ఉన్నా వాటి నిర్వహణ కూడా దారుణంగా ఉండేది. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవితాలు మారాలంటే అందుకు ఏకైక మార్గం విద్య మాత్రమే అని భావించారు. ఈ క్రమంలోనే పాఠశాలల్లో నాడు–నేడు మన బడి పేరుతో భారీగా నిధులు వెచ్చించి దాదాపు 2 వేల పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఇప్పటికే జిల్లావ్యాప్తంగా రూ.450 కోట్ల వరకు ఖర్చు చేశారు. పాఠశాలకు విద్యుదీకరణ, అదనపు తరగతి గదుల నిర్మాణం, గ్రీన్ చాక్‌బోర్డు, పెయింటింగ్, ఫ్యాన్లు, అవసరమైనన్ని టాయిలెట్లు, రక్షిత మంచినీరు, బెంచీలు ఇలా అన్ని రకాలుగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పాఠశాలలన్నీ కూడా కార్పొరేట్ పాఠశాలలకన్నా దీటుగా మారాయి. అంతే కాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రభుత్వ/ఎయిడెడ్/మున్సిపల్/ కేజీబీవీ/ ఎంపీపీఎస్/జెడ్పీహెచ్‌ఎస్ వంటి అన్ని పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పేరుతో పాఠశాలల ప్రారంభంరోజే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు, టై, బెల్టు, బూట్లు, వర్కు పుస్తకాలు, డిక్షనరీ, 3 జతల యూనిఫాం తదితరాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇవన్నీ ప్రభుత్వమే భరించి పిల్లలకు ఉచితంగా అందిస్తుండడంతో ప్రతి పేద కుటుంబంపైన జూన్ నెలలో కనీసం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు భారం తగ్గింది. ఇది కాకుండా ఇంకా అమ్మ ఒడి పేరుతో ఈనెలలోనే ప్రభుత్వం రూ.15 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేయనుండడంతో ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సైతం ఫీజుల భారం తగ్గనుంది.



పీవీఆర్ బాలికోన్నత పాఠశాల

■ నేటి నుంచే విద్యార్థులకు రాగిజావ

వేసవి వడగాలులు మరో ఐదు రోజులపాటు ఉండే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ జారీచేసిన ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో వారం రోజులపాటు ఒంటిపూట బడులుగా నిర్వహించాలని నిర్ణయించారు. ఉదయం 7.30 గంటలకు పాఠశాల ప్రారంభమై 11.30 గంటలకు ముగుస్తుంది. అంటే రోజుకు నాలుగు గంటలపాటు పాఠశాల నిర్వహిస్తారు. మధ్యలో ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్య రాగిజావను విద్యార్థులకు అందిస్తారు. 11.30 నుంచి 12 గంటల వరకు జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజనం) అందిస్తారు. వీటి నిర్వహణకు అవసరమైన బెల్లం, రాగిపిండి, బియ్యం, కందిపప్పుతోపాటు చిక్కీలు, కోడిగుడ్లు కూడా పాఠశాలలకు చేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలు ప్రారంభమైన తరువాత ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ నిర్వహిస్తే విద్యార్థులకు ఇబ్బందిగా మారుతుందని భావించిన ప్రభుత్వం పాఠశాలల ప్రారంభం రోజు నాటికే ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ ప్రక్రియ ముగించి నూతన స్థానాల్లో చేరేలా ఉత్తర్వులు జారీచేసింది. దీంతో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లయింది. దాదాపు 5 వేలమంది ఎస్‌జీటీ/స్కూల్ అసిస్టెంట్లు/ హెచ్‌ఎం గ్రేడ్ 2 ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు.

■ సాంకేతిక విప్లవం

పాఠశాలల్లో ఇప్పటికే ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి సంచలనం సృష్టించిన రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుని 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లను అందించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా మరో అడుగు ముందుకేసి సాంకేతిక విప్లవాన్ని విద్యార్థుల కళ్లముందుకు తీసుకొచ్చింది. 1 నుంచి 5 తరగతుల వరకు విద్యార్థులకు స్మార్ట్‌టీవీల ద్వారా విద్యాబోధన చేపట్టనున్నారు. ఇందుకుగాను జిల్లావ్యాప్తంగా 445 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇవి కాకుండా 277 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ను ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేయనుండటంతో కార్పొరేట్‌కంటే మిన్నగా ఆధునిక సాంకేతికత ప్రభుత్వ విద్యార్థులకు చేరువకానుంది.



జగనన్న విద్యాకానుక కిట్లలో భాగంగా పాఠశాలలకు చేరిన పుస్తకాలు

పేదరికం లేని సమాజమే జగనన్న లక్ష్యం

- మంత్రి ఆదిమూలపు సురేష్
- పెద్దదోర్నాలలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: పేదరికం లేని సమాజమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఒకటో సచివాలయం పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి జగన్ పరిపాలన చాలా బాగుందని, సంక్షేమంతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధితో పాటు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి పని చేస్తున్నారని అన్నారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అన్ని వసతులతో స్వర్గధామంగా నిలుస్తుందని వివరించారు. రాబోయే రోజుల్లో ఎన్నో కంపెనీల పెట్టుబడులతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పేదరికాన్ని రూపు మాపేందుకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందజేస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల చేయూతతో ప్రతి పేదవాడు ఆర్థికంగా బలోపేతం అయ్యారని అన్నారు. విద్యార్థులకు జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించి భవిష్యత్తులో ప్రతి ఇంటిలోనూ విద్యావంతులకు ఉన్నత ఉద్యోగం వచ్చేలా పాటు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకాన్ని వలంటీర్ల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దనే అందించటం హర్షణీయమని కొనియాడారు. సంక్షేమ పాలన అందించేందుకు ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు జగనన్న చేసిన సుదూర పాదయాత్రలో పొదుపు మహిళలు తాము చేసిన అప్పులు కట్టలేక నలిగిపోతున్న పరిస్థితిని కళ్లారా చూశారన్నారు. మహిళల అప్పులను విడతల వారీగా రద్దుచేస్తానని ఆనాడు మాట ఇచ్చారని చెప్పారు. ఆ మాట ప్రకారమే నవరత్నాల్లో చేర్చి విడతల వారీగా నగదును నేరుగా మహిళల అకౌంట్లలో జమ చేశారని అన్నారు. ఆయన నాలుగేళ్ల పాలన జవాబుదారితనంలో సాగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలో కూడా పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్లగలిగారని అన్నారు. వైఎస్సార్ అధికారంలో ఉన్న సమయంలో పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, ఆయన తనయుడు మరో అడుగు ముందుకు వేసి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరువు కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంతాన్ని ఆదుకోవాలన్న ఉద్దేశంతో టన్నెల్ పనులను వేగవంతంచేసి మొదటి టన్నెల్ పూర్తి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వివరించారు. ప్రతి ఇంటివారు రెండు మూడు పథకాలు లబ్ధి పొందామని ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే పథకాలన్నీ సక్రమంగా అందుతాయని మంత్రి వారికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, ఎంపీడీఓ ఎస్.విజయ, పంచాయతీ కార్యదర్శి మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, మండల నాయకులు గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌నాయక్, యక్కంటి మల్లారెడ్డి, దూదేకుల రసూల్, ఎస్సై శ్రీనివాసరావు, వ్యవసాయశాఖాధికారి జవహర్‌లాల్‌నాయక్, ఏపీఎం పోలయ్య, ఏపీవో అన్నపూర్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెంచుల ఆరాధ్య దైవం మంతనాలమ్మ

- మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రత్యేక పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి సురేష్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గిరిజనుల ఆరాధ్య దైవం మంతనాలమ్మకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం మొక్కులు తీర్చుకుని ప్రత్యేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రఖ్యాతి గాంచిన మంతనాలమ్మ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకుంటారు. ఆదిమూలపు సురేష్‌కు రెండో సారి మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కితే మంతనాలమ్మకు మొక్కులు చెల్లిస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు గంటా గురవారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో వారి ఆధ్వర్యంలో ఆదివారం భారీ సంఖ్యలో నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద మంతనాలలో వెలసిన మంతనాలమ్మ ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్‌కు పెద్దమంతనాలకు చెందిన చెంచు గిరిజనులు భారీగా స్వాగతం పలికారు. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి వీరన్నను పట్టు వస్త్రాలతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు మండల పరిధిలోని యడవల్లిలో జరిగిన రామాలయ ప్రథమ వార్షిక వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అమిరెడ్డి రామిరెడ్డి, యర్రగొండపాలెం మండల కన్వీనర్ ఓబులరెడ్డి, త్రిపురాంతకం ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, నాయకులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, మండల వైస్సార్ సీపీ నాయకులు గుమ్మా యల్లేష్, దుమావత్ చంద్రకాంత్‌నాయక్, కొర్రప్రోలు సర్పంచ్ చిన్న వెంకటమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పొందుగుల మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా కళాకారులకు మరణం లేదు



నటరాజ చిత్రపటానికి పూలమాల వేసిన కళాకారులు

ఒంగోలు టౌన్: ప్రజల కోసం జీవించి, ప్రజల కోసం మరణించిన కళాకారులు మరణం ఉండదని, ప్రజల హృదయాల్లో ఎప్పటికీ జీవించే ఉంటారని సినీ నటుడు బేతం శెట్టి హరిబాబు అన్నారు. జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం ప్రతినెలా కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సినీ దర్శకురాలు విజయనిర్మల, ప్రసిద్ధ నటుడు సాక్షి రంగారావుల వర్ధంతి నిర్వహించారు. తొలుత నటరాజు విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రతి నెలా ఆ నెలలో మరణించిన కళాకారులను స్మరించుకోవడం గొప్ప సంప్రదాయంగా నిలుస్తుందని జైభీం సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జాలాది మోహన్ అన్నారు. రంగభూమి కళాకారుల సంఘం కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, ధేనువకొండ సుబ్బయ్య ఆయా నటుల జీవిత విశేషాల గురించి ప్రసంగించారు. అనంతరం ఇటీవల ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో భారత దేశం తరపున ఆడి బంగారు పతకాన్ని, రజిత పతకాన్ని సాధించిన కళ్లు రాజేశ్వరిని చందు అకాడమీ, రంగస్థల కళాకారుల సంఘం తరపున సన్మానించారు. కార్యక్రమంలో త్రోవగుంట చందు, కోవెలగుంట్ల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు. చందు అకాడమీ చిన్నారులు ప్రదర్శించి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఐఏఎస్‌కు ఎంపికైన వినూత్నకు ఘన సత్కారం



కుటుంబ సభ్యులతో కలిసి వినూత్నను సత్కరిస్తున్న ప్రముఖులు

ఒంగోలు: చిన్నవయస్సులోనే ఐఏఎస్‌కు ఎంపికైన బొల్లిపల్లి వినూత్నను పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. స్థానిక బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సత్కార కార్యక్రమానికి ఏపీ స్టేట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కాకి కృపారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వినూత్న ఐఏఎస్ సాధించేందుకు చూపిన పోరాటం నేటి యువతరానికి స్ఫూర్తి అని కొనియాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన పశు సంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ చిన్నతనంలోనే ఐఏఎస్‌కు ఎంపికైన వినూత్నకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఆమె సేవలు సమాజానికి ఎంతో అవసరం అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో మంచి పేరు సంపాదించుకుని రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఐఏఎస్‌కు ఎంపికైన వినూత్న తనకు చిన్నతనం నుంచి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఆహ్వానించి వారందరినీ ఘనంగా సత్కరించారు. పేదలకు అండగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందించడంలో కృషిచేస్తానని, తన సక్సెస్‌కు కారణం తన తల్లిదండ్రులు, అధ్యాపకులే అన్నారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీ సీఈవో ఎం.శ్రీనివాసరావు, ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఈ.మురళి, ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రెటరీ ఎం.శ్రీనివాసరావు, లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ అధినేత లక్ష్మయ్య, స్టేట్ పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొని వినూత్నను ఘనంగా సత్కరించారు. అనంతరం వినూత్నతోపాటు వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.

బ్యాంకు పరీక్షలకు ఉచిత శిక్షణ

ఒంగోలు: బ్యాంకు పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్థానిక లాజిక్ అకాడమీ ప్రెసిడెంట్ అండ్ కరస్పాండెంట్ పాలపర్తి విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్స్(ఐబీపీఎస్) ప్రభుత్వ రంగ గ్రామీణ బ్యాంకుల్లో 8 వేల క్లర్కు పోస్టుల భర్తీ కోసం దేశ వ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తుందని, అంజయ్యరోడ్డులోని తమ సంస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులకు బ్యాంకుతోపాటు త్వరలో రానున్న సచివాలయ ఉద్యోగాలు, కానిస్టేబుల్ మెన్స్ పరీక్షలకు 75 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పేర్లను ఈనెల 16వ తేదీలోపు సెల్: 7207012758 నంబర్‌కు ఫోన్‌చేసి నమోదు చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు 79.93 శాతం హాజరు

ఒంగోలు: జిల్లాలోని ఏపీ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 79.93 శాతం మంది హాజరయ్యారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 6 సెంటర్లలో ఈ పరీక్షలు నిర్వహించారు. 1161 మంది పరీక్షలు రాయల్సి ఉండగా 928 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో 233 మంది గైర్హాజరయ్యారని డీఈవో పి.రమేష్ తెలిపారు.

ముగిసిన హాకీ శిక్షణ శిబిరం

చీమకుర్తి: ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో 40 రోజులుగా నిర్వహిస్తున్న హాకీ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. హాకీ కోచ్ కరిచేటి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు ఎస్సై జీ.రామిరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శిక్షణ పొందిన క్రీడాకారులు రానున్న రోజుల్లో నిర్వహించే హాకీ పోటీల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ఉరుములతో వర్షం

తాళ్లూరు: మండలంలో ఎట్టకేలకు ఆదివారం రాత్రి ఉరుములు, గాలులతో కూడిన స్వల్ప జల్లులు కురిశాయి. దీంతో కొన్ని రోజులుగా తీవ్ర ఉక్కపోతతో విల విల్లాడుతున్న ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఒక్కసారిగా పెద్ద గాలులు రావటంతో రోడ్లపై దుమ్ము, ధూళీ లేచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దర్శికి చేరిన బైక్ యాత్ర

- 175 నియోజకవర్గాలలో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



మోపెడ్ పై ప్రచారం చేస్తున్న రాజు

దర్శి: రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేస్తూ అన్నవరం నుంచి ఇచ్ఛాపురం వరకు బైక్ యాత్ర చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరాభిమాని అడవికొట్టు రాజు ఆదివారం దర్శికి వచ్చారు. నెల్లూరు జిల్లా జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన రాజు తన మోపెడ్ పై సీఎం చిత్రపటాలతో వైఎస్సార్ సీపీ జెండాలు పెట్టుకుని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి పాటల రూపంలో ప్రచారం చేస్తూ రాష్ట్రంలోని నియోజకవర్గాలు తిరుగుతున్నాడు. 55 ఏళ్ల వయస్సున్న రాజు రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు తిరగాలనే సంకల్పంతో ఇప్పటికి 66 నియోజకవర్గాలు పూర్తి చేసుకుని దర్శికి వచ్చాడు. రాజు మాట్లాడుతూ తాను ఎక్కడకు వెళ్లినా ప్రజల్లో సీఎం, వైఎస్సార్ సీపీకి మంచి స్పందన వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయం అన్నారు.

ఏపీ హాకీ జట్టు మేనేజర్‌గా రవికుమార్



చీమకుర్తి: ఏపీ హాకీ పురుషుల జట్టు మేనేజర్‌గా సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్లో పీఈటీగా పనిచేస్తున్న తిరుమలశెట్టి రవికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు ఒడిషాలోని రూర్కెలాలో బిర్సాముండా ఇంటర్నేషనల్ స్టేడియంలో 13వ హాకీ ఇండియా జూనియర్ మెన్స్ విభాగంలో ఏపీ జట్టు పాల్గొననుంది. 10 సంవత్సరాల నుంచి హాకీలో అనుభవం కలిగిన తాను ఏపీ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించనున్నట్లు రవికుమార్ తెలిపారు.

బధిరుల క్రీడా సంఘ అధ్యక్షుడిగా మహబూబ్ వలి



బధిరుల క్రీడా సంఘ కార్యవర్గం

ఒంగోలు టౌన్: జిల్లా బధిరుల క్రీడా సంఘం అధ్యక్షుడిగా దూదేకుల మహబూబ్ వలి ఎన్నికయ్యారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం బధిరుల క్రీడా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా ఉప్పలపాటి శివ, ప్రధాన కార్యదర్శిగా కె.తిరుమల సాయి, కోశాధికారిగా టి.అనిల్ ఎన్నికయ్యారు. యం.సురేష్, ఎస్.వీరనారాయణ, వి.ఈశ్వర్ ప్రసాద్, వై.వెంకట సుజాతలను ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

ఎస్సై కొట్టాడని ఆత్మహత్యాయత్నం


డీఎస్పీతో మాట్లాడుతున్న ఆందోళనకారులు

త్రిపురాంతకం: ఎస్సై కొట్టడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతని బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటన త్రిపురాంతకంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. త్రిపురాంతకంలో మూడు రోజుల క్రితం పంచాయతీ కార్యాలయం వద్ద పాత గొడవల కారణంగా ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. అందులో భాగంగా ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడే క్రమంలో ఎస్సై వెంకట సైదులు ఓ వర్గానికి చెందిన చల్లా గురువారెడ్డిపై చేయిచేసుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన గురువారెడ్డి ఇంటికి వచ్చి పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గురువారెడ్డిని వైద్యం కోసం తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం వినుకొండ తీసుకువెళ్లాలని సూచించారు. దాంతో అతని బంధువులు పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. ఆందోళనకారులు అక్కడున్న మరో వర్గం వారిపై దాడి చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐ కోటయ్య, కురిచేడు, దొనకొండ ఎస్సైలు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పొలాల్లో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పొదిలిరూరల్: మండలంలోని మల్లవరానికి చెందిన దొంల్లేటి వెంకటేశ్వర్లు అనే రైతు పొలంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో షార్ట్ సర్క్యూట్ సంభవించి పొలంలోని కరివేపాకు, పశుగ్రాసంతో పాటు పైపులు పూర్తిగా ఖాళీపోయాయి. విషయం తెలుసుకున్న దర్శి అగ్నిమాపకం కేంద్రం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

మార్కాపురం: మార్కాపురం జిల్లా వైద్యశాలలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వైద్యశాల సూపరింటెండెంట్ ఎస్.సుబ్బారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కురిచేడుకు చెందిన శేషమ్మ (58) ఆస్తమాతో బాధపడుతూ కొన్ని రోజులుగా మార్కాపురం జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమెకు ఆక్సిజన్ అందక మృతిచెందినట్లు సోషల్ మీడియాలో, వివిధ చానళ్లలో వార్తలు వచ్చాయి. ఆదివారం ఉదయం విద్యుత్ లైన్లకు మరమ్మతుల కారణంగా కరెంటు సరఫరా నిలిపివేశారు. ఆ సమయంలో ఆక్సిజన్ అందక శేషమ్మ మృతి చెందినట్లు వచ్చిన వార్తలు నిజం కాదని వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి, ఆక్సిజన్ సరఫరాకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోగానే జనరేటర్ వేశారని చెప్పారు.

మృత్యు ఘోష

- జిల్లాలో వేరువేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి
- పలు ప్రాంతాల్లో ఘటనలు


గోపి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్యాపిల్లలు


గోపి మృతదేహం


కనిగిరిలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు
ఇన్‌సెట్‌లో ఎస్‌కే షారూక్ మృతదేహం

కనిగిరి రూరల్: జిల్లాలో ఆదివారం మరణ మృదంగం మార్మోగింది. వేరువేరు ప్రాంతాల్లో జరిగిన వేరువేరు ఘటనల్లో మొత్తం ఆరుగురు మృత్యువాత పడ్డారు. వారిలో ఒక్క కనిగిరి ప్రాంతంలోనే ముగ్గురు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో యువకుడు ఎస్‌కే షారూక్ (27) మృతిచెందగా, అనుమానాస్పదస్థితిలో చిన్న కత్తుల గోపి (35) మృతిచెందాడు. కారు ఢీకొని మతిస్థిమితం లేని సుమారు 50 ఏళ్ల యాచకురాలు చనిపోయింది. దీంతో బాధిత కుటుంబాల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆయా ఘటనలకు సంబంధించిన పూర్తి వివరాలు...

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం...

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎస్‌కే షారూక్ (27) మృతి చెందిన ఘటన కనిగిరిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 9వ వార్డు వాల్మీకి వీధికి చెందిన షారూక్ శనివారం రాత్రి టిఫిన్ చేసి వస్తానని చెప్పి స్నేహితుడి స్కూటీ తీసుకుని వెళ్లాడు. పట్టణం నుంచి పామూరు రోడ్డు మాచవరం వైపు వెళ్తుండగా.. హెరిటేజ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో షారూక్ తల పైభాగం ఊడింది. కాలు విరిగిపోయింది. తల నుంచి తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై విగతజీవిగా పడిపోయాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1.15 గంటల సమయంలో జరిగిన ఈ దుర్ఘటనలో షారూక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

తల్లడిల్లిన తల్లిదండ్రులు...

చేతికందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యు ఒడికి చేరడంతో షారూక్ తల్లిదండ్రుల రోదనలు చూపరులను కలచివేశాయి. ఇప్పుడే వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన కొడుకు శవమై తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. షారూక్ తండ్రి జిలాని బాపట్ల జిల్లా రేపల్లోలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. పెద్ద కుమారుడైన షారూక్ పాలిటెక్నిక్ చదివివాడు.

అనుమానాస్పదస్థితిలో మరొకరు మృతి...

అనుమానాస్పదస్థితిలో చిన్నకత్తుల గోపి (35) మృతిచెందిన సంఘటన ఆదివారం కనిగిరిలో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరు జిల్లా వింజమూరుకు చెందిన గోపికి కనిగిరి బొగ్గులగొందికాలనీకి చెందిన వెంగమ్మతో సుమారు 15 ఏళ్ల కిత్రం వివాహమైంది. వీరికి నలుగురు సంతానం. కొంతకాలంగా భార్యాపిల్లలతో కనిగిరిలోనే గోపి ఉంటున్నాడు. కొన్ని నెలల నుంచి భార్యాభర్తల మధ్య సఖ్యత లేదు. దీంతో గోపి ఇంటికి వెళ్లకుండా బయటే తిరుగుతున్నాడు. గార్లపేట రోడ్డులోని వెంకటేశ్వరస్వామి గుడి వద్ద గల పార్కులో పగలు, రాత్రి నిద్రిస్తుంటాడు. ఈ క్రమంలో మృతిచెందడంతో ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. శనివారం ఉదయం కూడా గుడి దగ్గర షాపుల వద్ద నుంచి నీళ్లు తీసుకెళ్లినట్లు సమాచారం.

గోపి మృతిపై పలు అనుమానాలు...

ఘటనాస్థలం, మృతదేహం తీరును బట్టి చూస్తే గోపి రెండ్రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని తెలుస్తోంది. మృతదేహం బాగా ఉబ్బి ఉంది. అంతేగాకుండా గోపి శరీరంపై కుడి వైపు కాల్చినట్లు చర్మం లేచిపోయింది. మెడ, చేతి వెళ్లు ఉబ్బి ఉన్నాయి. గొంతు కింది భాగం నల్లగా మాడిపోయింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు.

కారు ఢీకొని యాచకురాలు...

కారు ఢీకొని గుర్తుతెలియని మతి స్థిమితం లేని యాచకురాలు (50) మృతిచెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. విజయవాడ నుంచి అద్దరోడ్డు వైపు వెళ్తున్న కారు కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్‌లో యాచకురాలిని ఢీకొట్టింది. ఈ ఘటనలో మతిస్థిమితం లేని వృద్ధురాలికి తీవ్ర గాయాలవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మూడేళ్ల నుంచి కనిగిరి పట్టణంలో యాచకురాలిగా ఆమె ఉంటోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టి...

ముండ్లమూరు: మండలంలోని రెడ్డినగర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బండ్లా రవిబాబు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యనగంటి సుబ్బాయమ్మకి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన బండ్లా రవిబాబు, సుబ్బాయమ్మ కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీశైలం వెళ్లారు. అనంతరం బైరవకోన వెళ్లి అక్కడి నుంచి స్వగ్రామమైన ఇంకొల్లు బయలుదేరారు. మార్గం మధ్యలో అద్దంకి – దర్శి ప్రధాన రహదారిపై రెడ్డినగర్ – పెద ఉల్లగల్లు మధ్యలో శీతలపానియం తాగేందుకు రోడ్డు కుడి పక్కకు ద్విచక్ర వాహనాన్ని తిప్పారు. అదే సమయంలో గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం మేరంపూడికి చెందిన కొలకలూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి కారులో దొనకొండ మండలం గజ్జలకొండ సిద్దాంతి దగ్గరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రవిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎల్.సంపత్‌కుమార్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య ఉండగా, ఇంకా పిల్లలు లేరు. విషయం తెలుసుకున్న భార్య బాలసుందరి దర్శి వైద్యశాలకు చేరుకుని భర్త మృతదేహం వద్ద భోరున విలపించింది. ద్విచక్ర వాహనంపై మృతునితో కలిసి ప్రయాణించిన సుబ్బాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి...


దొనకొండలో మృతి చెందిన సురేష్‌బాబు (ఫైల్)

దొనకొండ (దర్శి టౌన్): దొనకొండ గ్రామంలోని బ్రహ్మారావుపేటకు చెందిన ఓ వ్యక్తి స్థానికంగా ఉన్న పాడుబడిన బావి వద్ద కూర్చుని సేద తీరుతూ ప్రమాదవశాత్తూ బావిలో పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నున్న సురేష్‌బాబు ఉరఫ్ సుబ్రహ్మణ్యం (41) ఆదివారం దొనకొండలోని గజ్జలకొండ రైల్వేలైన్ పక్కన ఉన్న పాడుబడిన బావి వద్దకు వెళ్లి కూర్చుని సేద తీరుతూ పొరపాటున జారి బావిలో పడ్డాడు. అటుగా వెళ్తున్న ఇండ్లచెరువు గ్రామస్తులు గమనించి స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో బావిలో నుంచి తీసి 108లో వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతుడు చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ జీవిస్తుంటాడు. అతని భార్య కామేశ్వరి స్థానిక హైస్కూల్లో వంట మనిషిగా పనిచేస్తోంది. ఇద్దరు కుమార్తెలు ఉండగా ఒకరికి ఇటీవల వివాహమైంది.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో దూకి యువకుడు మృతి...

మద్దిపాడు: మండలంలోని మల్లవరం వద్ద గుండ్లకమ్మ జలాశయంలో దూకి ఒక యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలేనికి చెందిన కరవాది శ్రీను (35) శనివారం సాయంత్రం ఇంట్లోని వారితో మనస్పర్థలు రావడంతో రాత్రి 10 గంటల సమయంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్దకు వెళ్లి నీటిలో దూకగా ఆదివారం ఉదయం మృతదేహం పైకి తేలింది. సమాచారం అందుకున్న మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో వెళ్లి మత్స్యకారుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతునికి భార్య ఉంది.


కనిగిరిలో మృతిచెందిన గుర్తు తెలియని యాచకురాలు


ముండ్లమూరు రెడ్డినగర్ వద్ద మృతిచెందిన రవిబాబు


మద్దిపాడులో మృతి చెందిన వ్యక్తిని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్

ఒంగోలు టీచర్స్ కాలనీలో చోరీ

- 60 సవర్ల బంగారు నగలు, రూ.6 లక్షల నగదు చోరీ

ఒంగోలు టౌన్: నగరంలోని టీచర్స్ కాలనీలో ఓ ఇంట్లో దొంగలుపడి అందినకాడికి దోచుకుపోయారు. స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు గాంధీ రోడ్డులోని ఓ చిల్లర దుకాణంలో గుమస్తాగా పనిచేసే పోతిరెడ్డి కృష్ణారెడ్డి ఇటీవల టీచర్స్ కాలనీలోని రెండో వీధిలో కొత్తగా ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశం చేశారు. ఈ నెల 7, 8 తేదీల్లో ఇంట్లోకి సామగ్రి చేర్చుకున్నారు. ఆ మరుసటిరోజే అతని కుటుంబం తిరుపతి వెళ్లగా, కృష్ణారెడ్డి పనిలోకి వెళ్లాడు. ఉదయం 9 గంటలకు పనికి వెళ్లిన ఆయన.. రాత్రి 9 గంటలకు తిరిగి వస్తారు. ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో తిరుపతి నుంచి వచ్చిన కృష్ణారెడ్డి భార్య పద్మావతికి ఇంటి కిటికీ తలుపులు తెరిచి ఉంచడంతో అనుమానం వచ్చింది. మెయిన్ డోర్ తాళం తీసి ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలోని దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన 60 సవర్ల బంగారు నగలు, రూ.6 లక్షల నగదు దొంగలు ఎత్తికెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే తాలూకా సీఐ రాంబాబు సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఉద్యోగాల భర్తీలో మోడీ ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఒంగోలు టౌన్: ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఘోరంగా విఫలమయ్యారని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లెనిన్‌బాబు విమర్శించారు. ఒంగోలు మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. మోడీ 9 ఏళ్ల పాలనలో కొత్తగా ఒక నూతన పరిశ్రమ కూడా రాలేదని ఎద్దేవా చేశారు. ఉన్న పరిశ్రమలు మూసి వేసినందుకు ఉపాధి లేక కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. మోడీ ప్రభుత్వం ఉపాధి కల్పించకపోవడం వల్ల దేశంలో 7.8 శాతం నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఉపాధి ఎలా కల్పిస్తారో మోడీ చెప్పాలని ప్రశ్నించారు. వెంటనే దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, గ్రూప్ 1, 2 ఉద్యోగాల సంఖ్య పెంచాలని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.10వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు గుంటూరులో రాజకీయ సాంస్కృతిక సమ్మేళనం పేరుతో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.కరుణానిధి, గులాం హుసేన్, పురిణి రాంబాబు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఆనాటి ఆటలు.. ముత్యాల తోటలు

కొనకనమిట్ల: ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటారు. సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా ఎంత మోడ్రెన్, ట్రెండీగా మారినా.. సెల్‌ఫోన్ హల్ చల్ చేస్తున్నా.. డిజిటల్ మీడియా శాసిస్తున్నా.. పసితనం మాత్రం కోరుకునేది ఆట పాటలే.

గ్రామీణ క్రీడలు వారసత్వంగా ఇంకా కొనసాగుతుండటం ఎడారిలో ఒయాసీస్సులా.. ఓ మంచి పరిణామం. వేసవి సెలవుల్లో చిన్నారులు చాలా ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలో సెలవులు ముగిసి స్కూళ్లు తెరచుకోనున్న నేపథ్యంలో ఇంకా హుషారుగా గంతులేస్తున్నారు.

బిళ్లాకర్ర, అచ్చనగాయ, కబడ్డీ, కోతి కొమ్మచ్చి, జంపింగ్, తొక్కుడు బిళ్ల, గాలిపటాలు, గోళీలాట, బొంగరాలాట ఆడుతున్నారు. ట్రీ పెట్టెలో ఒకరు కూర్చుంటే కొందరు రైరైమని లాగడం, బుల్లి సైకిల్ మీద ముగ్గురు, నలుగురు ఎక్కి ఉత్సాహంగా తొక్కడం, చింత చిగురు సేకరిస్తూ, ఊయల ఊగడం వంటి దృశ్యాలు కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం కనిపిస్తున్నాయి.


కుంటుల్లాటలో జెట్ చేస్తూ..


ఊయలలో..


బొంగరం తిరగాల్సిందే..


సైకిల్‌పై సవారీ..


అచ్చనగాయ ఆటలో..

క్లుప్తంగా

విజయలక్ష్మికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న విజయలక్ష్మి

ఒంగోలు టౌన్: పొదిలి మండలం కాటూరి వారిపాలెం గ్రామానికి చెందిన కంచర్ల విజయలక్ష్మికి డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని దివిస్ ల్యాబ్‌లో పనిచేస్తున్న ఆమె.. అనలైటికల్ కెమిస్ట్రీలో చేసిన పరిశోధనకు గీతం యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 10వ తేదీ విశాఖపట్నంలోని గీతం యూనివర్శిటీలో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ ఇచ్చి సత్కరించినట్లు తెలిపారు. జిల్లాకు చెందిన పలువురు విద్యావేత్తలు, మేధావులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఐదు వేల మందికి మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సుహారి ఫౌండేషన్ ప్రతినిధులు

ఒంగోలు: స్థానిక కొత్తపట్నం బస్టాండు సెంటర్‌లో ఆదివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుహారి ఫౌండేషన్ ప్రతినిధులు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు, వడగాడ్పులతో ఉపశమనం పొందేందుకు బాటసారుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుంటి గంగా భవానికి విశేష పూజలు



అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ఆరు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 14,360 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



దేవతా విగ్రహాలకు భక్తుల పూజలు

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు గ్రామంలో రామచంద్రస్వామి జీవ, ధ్వజ, పోతురాజుస్వామి సహిత పోలేరమ్మ, అభయాంజనేయస్వామి విగ్రహ, శిఖర, కళశ, ఆదిత్య నవగ్రహ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ నవగ్రహారాధన, వాస్తు దేవతారాధన, జీవ హోమార్చన, పారాయణం, గ్రామ బలిహరణ, రుద్ర హోమాలు, క్షీరాధివాసం, సహస్రనామ పూజలను వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. రాత్రికి కోలాటం ప్రదర్శించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబ దేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వేసవి విజ్ఞాన సదస్సులతో ఉపయోగం



చీమకుర్తిలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ జవహర్, బదరీనారాయణ



ఉప్పుగుండూరులో మాట్లాడుతున్న సురేష్

కొత్తపట్నం: వేసవి కాలంలో విజ్ఞాన సదస్సులను విద్యార్థులు ఉపయోగించుకున్నారని సొసైటీ మాజీ అధ్యక్షుడు పురిణి శ్రీరాములరెడ్డి అన్నారు. కొత్తపట్నం గ్రంథాలయ పాలకుడు సీహెచ్ అజయ్ బాబు ఆధ్వర్యంలో 35 రోజుల పాటు వివిధ రకాల విజ్ఞాన సదస్సులు నిర్వహించి ఆదివారం ముగింపు సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములరెడ్డి మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థుల సమయం వృథా చేయకుండా ఇటువంటి విజ్ఞాన సదస్సులు పెట్టడం ద్వారా ఉపయోగం ఉంటుందన్నారు. 35 రోజుల పాటు నేర్పించిన విషయాలపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి శ్రీరాములరెడ్డి, ఉర్దూ స్కూల్ చైర్మన్ ఎస్.మస్తాన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో ముగిసిన గ్రంథాలయ శిక్షణ తరగతులు...

చీమకుర్తి: వేసవి సెలవుల సందర్భంగా గ్రంథాలయాల్లో నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. చీమకుర్తి గ్రంథాలయంలో మే 8న మొదలైన శిక్షణ తరగతులు శుక్రవారంతో 35 రోజులు పూర్తి చేసుకున్నాయి. రిసోర్స్ పర్సన్లు అయిన టీచర్ల ద్వారా స్థానిక విద్యార్థులకు కథలు చెప్పించడంతో పాటు వ్యాసరచన, పెయింటింగ్, డ్యాన్స్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన 75 మంది విద్యార్థులకు లయన్స్‌క్లబ్ తరఫున వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్, అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతిరోజూ విద్యార్థులకు లయన్స్‌క్లబ్ తరఫున స్నాక్స్, బహుమతులు అందించినట్లు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన 75 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. లైబ్రేరియన్ కే సత్యనారాయణ, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు గ్రంథాలయంలో...

సంతనూతలపాడు గ్రంథాలయంలో స్థానిక లైబ్రేరియన్ కే.నిత్యకల్యాణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక, విజ్ఞాన కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: ఆధునిక విద్యా వ్యవస్థలో కూడా గ్రంథాలయాలు వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం అభినందనీయమని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్ అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రంథాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆదివారం ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రోజ్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ తెలగతోటి శ్యామ్యూల్, వంకా వెంకట సుబ్బారావు, అమరా పున్నారావు, కొలకలూరి విజయ్‌కుమార్, పేరాల చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న శ్రీరాములరెడ్డి, మస్తాన్‌వలి

చిరస్మరణీయుడు.. మండువ



మండువ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: ఒకవైపు ప్రజలకు వైద్య సేవలు అందిస్తూనే.. మరోవైపు సామాజిక చైతన్యం కోరుతూ సాహిత్య సేద్యం చేసిన డాక్టర్ మండువ నరసింహారావు చిరస్మరణీయుడని ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక కమలా నర్సింగ్ హోం ఆవరణలో డాక్టర్ మండువ నరసింహారావు స్మారక కవి సమ్మేళనం నిర్వహించారు. గొప్ప వ్యక్తిత్వం, సహృదయం కలిగిన కవి అయిన మండువ రాసిన ప్రతి కవిత్వాన్ని ప్రజలు ఆదరించారని సభకు అధ్యక్షత వహించిన నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేసిన ఆయన.. పేద ప్రజల సేవలో తరించారని చెప్పారు. తెలుగు భాష అందం, మాధుర్యం, సౌందర్యం తెలిసిన కవి మండువ అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ నూనె అంకమరావు, కుర్రా ప్రసాద్ బాబు, సింహాద్రి జ్యోతిర్మయి, యూవీ రత్నం, డాక్టర్ మున్నంగి రాజకుమారి, బీనీడి కృష్ణయ్య, రామచంద్రుని లక్ష్మి, రాధ మనోరంజని, సూర్యకుమారి, ధర్నాశి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నరసింహారావు కుటుంబ సభ్యులైన ప్రముఖ వైద్యులు సుభాష్, కమల, పద్మలతలు కవులను ఘనంగా సన్మానించారు.

ఉచిత విద్యతో ఉన్నత చదువులు

- జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనతో రాణిస్తున్న విద్యార్థులు
- పల్లెల్లో విద్యా కుసుమాలను పూయిస్తున్న సీఎం వైఎస్ జగన్



నూతన ఉత్సాహంలో విద్యార్థినులు (ఫైల్)

ముండ్లమూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. పేదల ఉన్నత విద్యకు తోడ్పాటునందించేందుకు ఉన్నత చదువుల కోసం పూర్తి ఫీజు చెల్లించేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తోంది. ఆయా పథకాలతో నిరుపేదలైన చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతూ ముందుకు దూసుకెళ్తున్నారు. మెరిట్ ఆధారంగా అన్ని వర్గాల వారికి ప్రోత్సాహకాలు అమలు చేయడంతో అనేక మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోంది. గత ప్రభుత్వ పాలనలో పేద విద్యార్థులు సకాలంలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక నానా అవస్థలు పడ్డారు. నేడు వైఎస్సార్ సీపీ జగనన్న ప్రభుత్వ పాలనలో ముందుగా ప్రకటించిన సమయానికి నేరుగా తల్లులు, విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ చేయడంతో సకాలంలో కాలేజీల్లో విద్యార్థులు ఫీజులు జమ చేస్తూ ఆనందంగా చదువుకుంటున్నారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వం నగదు జమ చేసే వరకు కాలేజీలు అవకాశం కల్పిస్తుండటంతో ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. ఉన్నత చదువు చదువుకొనే సమయంలోనే విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించడం కోసం ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని రూపొందించి వారికి ప్రభుత్వం స్కిల్‌డెవలప్‌మెంట్‌పై ఆసక్తి పెంచుతోంది. ప్రభుత్వం అవలంబిస్తున్న అనేక పథకాలను పేద నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఆయా రంగాల్లో ప్రగతి సాధిస్తూ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు.



జగనన్న పాలనలో చాలా సంతోషంగా చదువుకుంటున్నాం. మాది ముండ్లమూరు మండలం రమణారెడ్డిపాలెం. మా తల్లిదండ్రులు ధనలక్ష్మి, శింగయ్యలు రోజు వారి కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. నిరుపేద కుటుంబం. నేను ఇంటర్మీడియెట్ ఒంగోలులో పూర్తి చేశా. అప్పట్లో అరకొర స్కాలర్‌షిప్ రావడంతో అతి కష్టంతో చదివించారు. అనంతరం ఎంసెట్‌లో ర్యాంక్ రావడంతో విజయవాడ దగ్గరలోని అమృతసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో సీటు వచ్చింది. పేద విద్యార్థులకు పూర్తిగా ఫీజు చెల్లించేందుకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను ప్రవేశ పెట్టడంతో పూర్తి సహాయ సహకారాలు అందాయి. విద్యాదీవెన ద్వారా పూర్తి ఫీజు ఏడాదికి రూ.35 వేలు, వసతి దీవెన ద్వారా ఏడాదికి రూ.20 వేలు లభించడంతో తల్లిదండ్రులపై ఎలాంటి భారం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులందరం సంతోషంగా ఉంటున్నాం.

గోపనబోయిన లింగారావు, బీటెక్ విద్యార్థి, రమణారెడ్డిపాలెం



ఉన్నత చదువులు జగనన్నతోనే సాధ్యం. మాది పేద కుటుంబం. తల్లి రమాదేవి కూలి పని. తండ్రి చిరు ఉద్యోగి. నేను బీఫార్మసీ ఒంగోలులో చదివినప్పుడు సకాలంలో ఫీజు రీయింబర్స్ రాక చాలా ఇబ్బంది పడ్డా. అప్పట్లో వసతి దీవెన లేదు. నామ మాత్రపు స్కాలర్ షిప్ వచ్చేది. అది కూడా సకాలంలో రాదు. తల్లిదండ్రులపై ఆధారపడి చదివా. అతి కష్టం మీద ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని బీఫార్మసీ పూర్తి చేశా. ఖర్చు ఎక్కువ కావడంతో తల్లిదండ్రులు చదివించలేమన్నారు. ఎంఫార్మసీలో కృష్ణా యూనివర్సిటీ మచిలీపట్నంలో సీటు సాధించా. జగనన్న ప్రభుత్వం పేద విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించేందుకు జగనన్న విద్యాదీవెన పథకంతో ఏడాదికి లక్షా పది వేల రూపాయలు కాలేజీ ఫీజు ప్రభుత్వం నేరుగా మా ఖాతాలో జమ చేసింది. ఇప్పటికి రెండు సార్లు జమ చేసింది. జగనన్న వసతి దీవెనలో భాగంగా అక్కడే బాలికల వసతి గృహంలో సీటు రావడంతో పూర్తిగా ప్రభుత్వమే చెల్లించింది. దీంతో పైసా ఖర్చు లేకుండా ఎంఫార్మసీ చదువుతున్నా. మా చెల్లి క్రాంతి బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మా చెల్లికి విద్యాదీవెన, వసతి దీవెన వస్తోంది. తల్లిదండ్రులపై ఎలాంటి భారం లేదు. ఇలాంటి ప్రభుత్వంతోనే పేద విద్యార్థుల ఉన్నతి విద్య సాధ్యమవుతుంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

జి.సౌజన్యదీప్తి, ఎం.ఫార్మసీ, వేములబండ

ఏం చేశారని సంబరాలు..?



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

- బీజేపీ పాలకులకు వామపక్షాల ప్రశ్న
- అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన

ఒంగోలు టౌన్: దేశ ప్రజలకు ఏం చేశారని బీజేపీ సంబరాలు చేసుకుంటుందో చెప్పాలని వామపక్ష నాయకులు ప్రశ్నించారు. విశాఖపట్నంలో అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ ఒంగోలు సాగర్ లాడ్జి సెంటర్లో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నాయకుడు కోటేశ్వరరావు ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ పాలకులు కరోనా సమయంలో దేశ ప్రజలను ఆదుకోకుండా మూఢ విశ్వాసాలతో కాలయాపన చేశారన్నారు. అప్రకటిత లాక్‌డౌన్ విధించి ప్రజలను రోడ్ల పాలు చేశారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇస్తానన్న ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేయడమే కాకుండా విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా ద్రోహం చేశారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు, కడప స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు తదితర విషయాల్లో మొండిచేయి చూపిన బీజేపీ పాలకులు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని రాష్ట్రానికి వస్తారని నిలదీశారు. 32 మంది బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ లాభాలలో ఉన్నప్పటికీ ప్రైవేటు పరం చేయాలని చూడటం మోదీ నయవంచనకు పరాకాష్ఠ అని చెప్పారు. నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అండగా నిలబడకుండా నికృష్ట రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీకి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. దేశానికి, రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బీజేపీ 9 ఏళ్ల పాలన పేరుతో సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. మోదీ 9 ఏళ్ల పాలనలో గ్యాస్, డీజిల్ ధరలతో పాటుగా నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటి నిరుపేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారని చెప్పారు. పెద్దనోట్ల రద్దుతో అనేక మంది నిరుపేదలు, చిరుద్యోగులు రోడ్డున పడ్డారని, మూడు వ్యవసాయ చట్టాలతో వ్యవసాయ రంగం కుదేలైపోయే పరిస్థితి తెచ్చారని తెలిపారు. ప్రజా వ్యతిరేక పాలనతో ప్రజలను ఇబ్బంది పెడుతూ అంబానీ, అదానీల ఆస్తులు పెంచుకునేందుకు అహర్నిశలు పాటుపడుతున్న మోదీ గద్దె దిగితేనే ఈ దేశం, రాష్ట్రం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్.వెంకటరావు, లెనిన్‌బాబు, ఎం.సుబ్బారావు, కరుణానిధి, గులాం హుసేన్, మోహన్, నాంచారులు, విజయ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ శాంతారావు

కొత్తపట్నం: మండలంలోని ఆకుల అల్లూరులో రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పోలురాధ పోటీలను ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న పోటీల్లో 22 ఎడ్ల జతలు తలపడుతున్నాయి. ఆదివారం జూనియర్ విభాగంలో ఎడ్ల ప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగాయి. అల్లూరుకు చెందిన బంకా శ్రీను ఎడ్ల జత నిర్ణీత సమయంలో 2,700 అడుగులు లాగి మొదటి బహుమతి కైవసం చేసుకుంది. అదే విధంగా మడనూరు గ్రామానికి చెందిన బత్తుల వంశీ కృష్ణారెడ్డి ఎడ్లు 2,500 అడుగులు లాగి రెండోవ స్థానంలో నిలిచాయి. పగడంవారిపాలెం చెందిన కుంచాల వేదలత కృష్ణారెడ్డి ఎడ్లు మూడవ స్థానంలో, బాపట్ల జిల్లాకు చెందిన ఎం.జాలయ్య ఎడ్లు నాల్గవ స్థానంలో, బేతపూడి గ్రామానికి చెందిన బల్లె కోటేశ్వరరావు ఎడ్లు ఐదోస్థానం, బల్లెపల్లి కోటేశ్వరరావు ఎడ్లు ఆరవ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు, జ్ఞాపికలను ఎంపీటీసీ మిట్నసల శాంతారావు అందజేశారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా హాజరయ్యారు. బంకా శ్రీను, దాసరి కొండయ్య, ఏటీ సుబ్బారావు, జూపూడి కిరణ్, బాలకోటయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత



మోటారు ట్రై సైకిల్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి అన్ని విధాల చేయూత అందిస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని వై.కొత్తపల్లికి చెందిన వనిపెంట పుల్లారెడ్డికి మోటారు ట్రై సైకిల్ అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ షాబీర్ బాషా, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, చిలకల అంకిరెడ్డి, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మూలవిరాట్‌ను ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

625 మందికి వైద్య సేవలు

గిద్దలూరు రూరల్: డా.బ్రహ్మానందరెడ్డి వైద్యశాల, ఒంగోలు కిమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణంలో డా.బ్రహ్మానందరెడ్డి 625 మందికి ఉచిత వైద్య సేవలను అందించారు. కంటి ఆపరేషన్‌లు 51 మంది, చెవి ముక్కు ఆపరేషన్లు ఆరుగురు, ఇతర ఆపరేషన్ల కోసం 11 మందిని గుర్తించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

భక్తిగీతాల పోటీలో విజేతలకు బహుమతులు



విజేతలతో కమిటీ ప్రతినిధులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని నెహ్రూ బజార్ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్నారులకు నిర్వహించిన భక్తి గీతాల పోటీల్లో విజేతలకు మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కమిటీ ప్రతినిధుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో సుమారు 50 మందికి పైగా చిన్నారులు పాల్గొన్నారు. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాబా మందిరంలో నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో యువసేవ సమాజ్ అధ్యక్షుడు గోపాలుని కృష్ణమోహన్, గాయకుడు జిల్లెల వెంకటేశ్వర్లు, చిత్తారి రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.